

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

**ఆంజనేయులి మాస్టారి 'మొట్టు'**

మాస్టర్లందర్లోకి మా ఆంజనేయులు మాస్టారికి ఓ ప్రత్యేకత వుంది. ఆయన ఎవర్నీ ఎప్పుడూ బెత్తం తీసుకుని కొట్టేవారు కాదు. "ఇట్రారా", అని పిలిచి నవ్వుతూ, ఏవేవో మాట్లాడుతూ ఆదమరచి వున్నప్పుడు ఒక్క 'మొట్టు' మొట్టేవారు. అంతే!. పొన్నకాయిలాగా నెత్తిన 'ఇంత' 'బొడిపె' కట్టేది. ఆ బాధ వర్ణనాతీతం. ఆడపిల్లలకీ మగపిల్లలకీ ఆయన ఇచ్చే ట్రీట్‌మెంటు ఇదే ఓరినాయనో అవేమి వేళ్ళో! ఒకసారి నాకూ ఆ సత్కారం జరిగింది. వారం రోజులపాటు తలదువ్వుకుంటే ఒట్టు. థర్డ్‌ఫాంలో మొదటి క్వార్టర్లీలోపులోనే ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలు (పేర్లెందుకులెండి) కొత్త తాటాకుల మీద కూర్చున్నారు. అంటే 'పెద్దమనుషు'లయ్యారన్నమాట. పేరంటానికి మా అమ్మతో కూడా వెళ్ళి, వచ్చేటప్పుడు అడిగా. "అమ్మా వాళ్ళు మామూలుగానే వున్నారుగా? మరి పెద్ద మనుషులెప్పుడయ్యారూ? ఎలా అయ్యారూ?" అని.

"నోరుముయ్యవే! వెధవ ఆరాలు నువ్వూనూ?" అంటూ విసుక్కుంది.

అయితే ఇంటికెళ్ళాక, "దీనితోటి వాళ్ళందరూ పెద్దమనుషులౌతున్నారు. ఇదేమో 'బడిత'లాగా అలాగే వుంది!" అని మా నాన్నతో అంది.

నాన్న ఏమీ మాట్లాడలా. సరే, స్కూలుకొచ్చిన 'అనసూయ'ని అడిగాను, "నువ్వు పెద్దమనిషివయ్యావుగదా! ఎలా అయ్యావే?" అని. అది విసుగ్గా నావంక చూసి, "నువ్వూ అవుతావులే.! అప్పుడు తెలుస్తుంది. ఇలాంటి చెత్తప్రశ్నలు ఎవర్నీ అడక్కు!" అన్నది పెద్ద ఆరిందాలాగా.

నాకూ చికాకు పుట్టి అడగటం మానేశా. ఆడపిల్లల్తో స్నేహం చెయ్యడమేగాదు., మాట్లాడాలన్నా నాకు అందుకే విసుగూ చికాకూ!

హాఫ్‌ఇయర్లీ పరీక్షల్లో మళ్ళీ నేనే ఫస్టు. కారణం మా తెలుగు మాస్టారు వైద్యుల కృష్ణారావుగారు. ఆయన ఓ కథ చెప్పి నా 'కళ్ళు' తెరిపించారు. కథ ఇదీ –

ఒక వూళ్ళో ముగ్గురు స్నేహితులున్నారట. వాళ్ళ ముగ్గురికీ మూడేసి ఎకరాల పొలం వున్నదిట. ఒకడేమో చాలా తొందరపాటు మనిషి. రేపు ఊరెళ్ళాలంటే బస్సు మిస్సవుతానేమోనని తెల్లవార్లూ మేలుకునేరకం. రెండోవాడు బద్ధకిస్టు. బస్సు వచ్చాక లేద్దాం అనుకుంటూ నిద్రపోయేరకం. మూడోవాడు 'సమయం' విలువ తెలిసినవాడు. ప్రతిపనీ సరైన పద్ధతిలో సరైన సమయానికి చేసే టైపన్నమాట. సరే.. తొలకరి వానలు రాబోతున్నాయి. మొదటివాడు తొందరపడి ముందరే పొలంలో విత్తనాలు నాటేశాడు. తొలకరి రాక ఆలస్యమైంది. రెండు మూడు వారల తరవాతే తొలకరి వాన కురిసింది.

రెండోవాడు 'రేపో ఎల్లుండో మొదలుపెడదాంలే' అనుకుని బద్ధకంతో విత్తనాలు చల్లడం ఆలస్యం చేశాడు.

మూడోవాడు తొలకరి వాన కురిశాక సరైన సమయంలో విత్తుల్ని నాటాడు.

మొదటివాడూ, రెండోవాడు పంట దిగుబడికాక, లబోదిబోమంటుంటే, మూడోవాడు మాత్రం చక్కని ఫలసాయం పొంది ఆనందంగా వున్నాడు.

ఈ కథ చెప్పి, "సీతా.. నువ్వెవరిలాగా ఉండాలనుకుంటున్నావూ?" అనడిగారు.

"ఖచ్చితంగా మూడోవాడిలాగానే!" అన్నాను.

"అవునా? మరికథల పిచ్చిలో పడి స్కూలు పుస్తకాల్ని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నావూ? నువ్వు చదివే పుస్తకాలు నిస్సంశయంగా గొప్పవే! అవి చదవటంవల్ల వచ్చే లోకజ్ఞానమూ అనంతమే, కానీ ప్రస్తుతం నువ్వేం చెయ్యాలీ? ముందు నీ స్కూలు పుస్తకాల్లో వుండేవి మస్తకానికి ఎక్కించుకుని నూటికి నూరుశాతం మార్కులు తెచ్చుకోవాలి. శలవుల్లో లైబ్రరీ వుండనే వుంది. ఇప్పుడు లైబ్రరీకి వెళ్ళి ఆ ధ్యాసలో పడ్డావనుకో, రోజులు గడిచిపోతై. పరీక్షలు వస్తై. అప్పుడు నువ్వు ఎంత ఏడ్చినా, పోయిన 'సమయం' తిరిగొస్తుందా? నువ్వెంత విజ్ఞానాన్ని ఆర్జించినా, పరీక్షలు పాస్ కాకపోతే నీకు గౌరవమూ, విలువా వస్తాయా?" అని చల్లగా, చక్కగా చెప్పి నా కళ్ళు తెరిపించారు.

ఆ రోజు అనుకున్నాను. పరీక్షల ముందు మిగతా వ్యవహారాలు ఏమీ పెట్టుకోకూడదనీ, సమయాన్ని గౌరవించాలనీ.

కానీలూ అణాలూ బేడలు కనుమరుగు అయిపోతాయిట. ఇకనించీ పైసలు వస్తాయట. పైసాబిళ్ళలు (రాగివి..గుండ్రని బొట్టులా) అయిదు పైసల బిళ్ళలు ఇరవై పైసల బిళ్ళలూ వచ్చాయి. పదిపైసల బిళ్ళలు మామూలేగదా మరి.

అన్నట్టు నేను మూడూ నాలుగూ తరగతుల్లో వుండగా చాలా కానీలూ, చిల్లుకానీలూ, అణాలూ పాతిపెట్టాను. డబ్బుల చెట్లు మొలుస్తాయని. జాగ్రత్తగా నీళ్ళుకూడా పోసేదాన్ని. ఏ చెట్టూ మొలవలేదనుకోండీ!

పైసాకి ఓ రెండు గుండ్రని చిన్న బ్రిటానియా బిస్కెట్లు వచ్చేవి. దమ్మిడీల్ని నేను అసలు చూడలేదు.

జీడీ రెండు పైసలు. అణా అంటే ఆరుపైసలు. అణా ఇస్తే మాత్రం పూర్వపు లెక్క (నాలుగు క్లాన్లు) ప్రకారం నాలుగు జీళ్ళు ఇచ్చేవారు.

ఇంటింటికీ తిరుగుతూ ఇడ్లీలమ్మే కోమటాయన బేడకి నాలుగు ఇడ్లీలు ఇచ్చేవాడు. (ఇవన్నీ స్కూల్లో కొనుక్కోవడమేగానీ ఇంటిదగ్గరకాదు.) బఠాణీలు గిద్దెడు అణా.

అన్నట్టు మానికలూ వీశలూ అరవీశలూ పోయి కిలో, అరకిలో, పావుకిలో నూరూ, యాభై గ్రాములు ఇలా 'తూకపు' లెక్కలు కూడా మారిపోయాయి. మనిషి బరువుని కూడా 'పౌన్ల'లో తూచడం మానేసి కిలోల్లో తూస్తున్నారు. (మా హైస్కూల్లో హైటూ వెయిటూ నమోదు చేసేవారులెండి!)

ఇంతకీ చెప్పొచ్చినదేమంటే, మా క్లాసులో అంటే థర్డ్‌ఫాంలో ఇద్దరూ, సెకండ్‌ఫాంలో ఒకతీ పెద్దమనిషైంది ఆంజనేయులుగారి మొట్టికాయలు తిన్నమరుసటిరోజునే! ఇదో పెద్ద 'న్యూస్' అయిపోయింది. ఆయనకూడా సరదాగా, "మొట్టుమొట్టానంటే చాపెక్కుతారు.. అప్రాచ్చపు ఆడంగుల్లారా!" అని ముసిముసిగా నవ్వుకునేవాడు. రెండుమూడుసార్లు ఇలా క్లాసులో అనేసరికి ఎలా తెలిసిందోమరి., హెడ్మాస్టరుగారు ఆయనకి ఏం చెప్పారోగానీ, ఆడవాళ్ళని మొట్టాల్సివచ్చినా, ఎవడ్నో ఒకడ్ని పిలిచి ఆ కోపం వాడిమీద చూపించేవారేగానీ, ఆడపిల్లల్ని 'మొట్టే'వారుకాదు.

***కొరివిదెయ్యాలు***

అన్నట్టు 'న్యూస్' అంటే ఏమిటో మా ఇంగ్లీషుకొచ్చే పి.నారాయణరావుగారు చెప్పారు. NEWS అంటే నార్త్, యీస్ట్, వెస్ట్ ఎండ్ సౌత్. అనగా తూర్పు పడమర ఉత్తరదక్షణమూలన్నమాట. యీ నలుదిక్కుల మధ్య జరిగేదంతా NEWS. అనగా, విశేషములు లేక

వార్తలు.. అన్నారు. అంతేగదా.! ప్రతి ఇంటికీ నాలుగు దిక్కులూ చూసేగా ఇల్లు కట్టేది! (వాస్తు) అలాగే ప్రతీవీధికీ, ఊరికీ, రాష్ట్రాలకీ, దేశాలకీ కూడా దిక్కులు ఉండి తీరాలిగదా! అంటే యీ వార్తలు, విశేషాలు, పుకార్లు, ఇవన్నీ కూడా 'న్యూస్' కిందకేగదా వచ్చేది!

ప్రస్తుతం లేటెస్టు న్యూస్ ఏమిటనగా, ఏలూరు రోడ్డుమీద (మా వూరికి, రెండు ఫర్లాంగుల దూరం) వున్న జంట మర్రిచెట్లు మీద రెండు 'కొరివిదెయ్యాలు' తిరుగుతున్నాయని. ఇహనేం... ఊరంతా వెర్రెత్తిపోయింది.

"నేన్జూశానొర్రేయ్.! నిప్పులు గక్కుతూ వుంది! ఓ దున్నపోతుని ఏకంగా మింగేసేంత నోరనుకో! ఓర్నాయినోయ్.. మళ్ళీ అటువైపు వెళ్తే ఒట్టు!" అన్నాడు అడ్డరోడ్డునిండి రోజూ మా హైస్కూలు కొచ్చే తిమోతీగాడు.

"ఎప్పుడు చూశావురా?" ఆత్రంగా అడిగాడు దివాయ్. వాడు మహాపిరికోడు.

"నిన్న ఫుట్‌బాలు ఆడుకుని, ఆ తరవాత నిరంజన్‌గాడి ఇంటికెళ్ళి, అక్కడ్నించి నిర్మల్ దాసుగాడ్ని జాన్‌సుదర్శరావు గాడ్నీ కలిసే సరికే ఏడుదాటిపోయిందా! రోజూ వచ్చేదారేగదా, అదీ తార్రోడ్డేగదా అని ఎళ్ళ బార్రానా.. జంట మర్రెచెట్ల మీంచి నిప్పులు రాల్తున్నై. ఎంతయినా మనం మేరీమాత భక్తులంగదా.. ధైర్యంగా ముందుకెళ్ళా!. 'హూ..స్' అని సౌండు!" ఆగాడు తిమోతీ - "చెప్పరా.!" సస్పెన్సు భరించలేక ఆత్రంగా అడిగాడు గంగాధరం.

"చెవులు ఊగిపోయాయనుకో ఆ సౌండుకి.! అప్పుడు జూశా వాటిని. కళ్ళు బూడిద గుమ్మడికాయలంతున్నై. కోరలేమో చీపురుకట్టల్లా వున్నై.. నోట్లోంచి నిప్పులు రాలుతున్నై.. కళ్ళు మూసుకుని ఒకటే పరుగుపెట్టా.. అయితే, చెట్లని దాటాక ఏ శబ్దాలూ వినిపించలా 'భయపడు బిడ్డకు నీవే దిక్కు మేరీమాతా' పాటపాడుకుంటూ అడ్డరోడ్డుదాకా లగెత్తా. మా అమ్మకి చెపితే నిమ్మకాయ తీసింది. పొద్దున్నే ఫాదరుగారు పవిత్రజలం నా మీద జల్లారు!" పూర్తి కథ వివరించాడు తిమోతీగాడు. అసలు వాడికి బల్లిని చూస్తేనే ఒణుకు. అట్లాంటివాడు కొరివిదెయ్యాల్ని వర్ణించగలిగేంతగా చూశాడంటే అస్సలు నమ్మబుద్ధిగాలా. అసలు వాడెంత సైలెంటుగాడంటే, మా క్లాసులో తప్ప పక్క క్లాసులో వాడిక్కూడా వీడి పేరు తెలీదు.

అలాంటి వాడు కాస్తా 'కొరివిదెయ్యం' కథతో స్కూల్లో ఫేమస్ అయిపోయాడు. అందాకా ఎందుకూ, మాస్టర్లే వాడ్ని పిలిపించుకుని 'కథ' విన్నారు. ఆ తరవాత ఓ వారం పదిరోజుల తరవాత టైటస్ జయరాజ్‌గాడూ, మస్తాన్‌వలీగాడూ (మస్తాన్ గాడిది రేచర్ల - దెయ్యాలు కొలువున్నది అపోజిట్ రోడ్డు అనగా ఏలూర్రోడ్డులో) కూడా దెయ్యాల్ని చూశామని వాటి ఆకారవికారాల్ని వర్ణించారుగానీ, తిమోతీగాడంత 'ఫేమస్' కాలేకపోయారు.

ఈ సంఘటనతో నాకో 'జీవితసత్యం' తెలిసింది. నిజమైనా అబద్ధమైనా 'ఫస్ట్ యీజ్ బెస్ట్' అని. తిమోతీ చెప్పింది ఫస్ట్‌న్యూస్. అది వాడి భ్రాంతి తప్ప నిజంకాదు. వాడి తరవాత ఇద్దరు అదే కథని కొంచెం మార్చి చెప్పారు. కానీ, తిమోతీగాడికే 'క్రెడిట్' దక్కింది. వాళ్ళ కథలు 'డైల్యూట్' అయ్యాయి.

ఇంతకీ యీ కొరివి దెయ్యం విషయం ఎందుకు చెప్పానంటే, వాళ్ళ పాకమీద మిసమిసలాడుతున్న సొరకాయని నేను కోశానని, అన్యాయంగా నామీద నీలాపనింద వేసిన అనసూయమ్మ మీద కచ్చతీర్చుకోవడానికి యీ 'దెయ్యం' నాకు సహాయం చేసింది.

ఓ ఆదివారం మందీమార్బలంతో మేము, అనగా పాత బడివాళ్ళం అనసూయమ్మగారి ఇంటి వెనకవున్న ఖాళీ స్థలంలో గోలీలాట ఆడటం నిజం. ఆటలు ముగించి మధ్యాహ్నం మేం తిండికోసం ఇళ్ళకి పోవడం నిజాతినిజం. ఆ సందట్లో ఎవరో ఒకరు ఆ సొరకాయని కొట్టేసి ఉంటారనేదీ మహా నిజమే. కానీ కొట్టేసింది నేను కాదు. కానీ 'నీలాపనింద' మాత్రం నామీద కొచ్చింది. మా అమ్మకూడా మళ్ళీ 'అదోలా' నావంక చూసేసరికి నా ప్రతిష్ఠ మంటగలిసింది. కచ్చతీర్చుకోవాలనే 'ఇచ్ఛ' బలపడి ఆ రోజు రాత్రి ఎనిమిదింటికి ఓ గోనెసంచీ కప్పుకుని అనసూయమ్మగారి కిటికీలోనించి భయంకరమైన 'దెయ్యం' ఏడ్పుని వినిపించా. 'వారంలో నిన్ను మిగేస్తానే!' అని కూడా భీకరమైన దొంగ గొంతుతో (ఫాల్స్ వాయిస్) అరిచా. అరిచి, మరుక్షణం గుడిపాటి వాళ్ళ బుల్లి గోడదూకి, ఆశ్రమానికి పోయి,

తొమ్మిదింటికి ఏమీ ఎరగనట్టు మిగతా భక్తురాళ్ళతో కలిసి ఇంటికి చేరాను. అనసూయమ్మగారు 'విడో' గనకనూ, ఒక్కతే వాళ్ళ చిన్నపాకలో వుంటుంది గనకనూ, నా దెబ్బ అంటే, దెయ్యం దెబ్బకి భయపడి మూడురోజులపాటు జ్వరం తెచ్చుకుని, "ఇంకో నాల్రోజుల్లో ఆ పాడు దెయ్యం నన్ను మిగేస్తుంద్రోయ్" అని గగ్గోలు పెట్టిందని మీకు తెలీదుగదా!

మా శివాలయం పూజారిగారు ఆవిడకి 'సింధూరం' పెట్టి, హనుమాన్‌చాలీస్ పుస్తకం ఒకటి ఇచ్చి, దాన్ని తలకింద పెట్టుకుంటే, 'భూత ప్రేత పిశాచగణాలు ఆ చుట్టుపక్కలకి రానేరావు' అని సోదాహరణంగా నిరూపిస్తేగానీ ఆవిడ భయం తగ్గలేదు.

ఆ తరవాతే గాదు, అంతకు ముందు కూడా, 'దెయ్యాల గురించీ, కొరివి దెయ్యాల గురించీ, రకరకాల రుచులు కోరే తిండి దయ్యాల గురించీ, నానా అల్లరీ చేసే చిలిపి దెయ్యాల గురించీ కథలు కథలుగా విన్నాను. .. వింటున్నాను.

ఇప్పుడు గనక అవి నిజంగా ఉంటే -

1. ఒక ఇల్లు ఊడ్చేదెయ్యం

2. రుచిగా శుచిగా వంట చేసే దెయ్యం.

3. చక్కగా బట్టలు ఉతికి ఆరేసి ఇస్త్రీ చేసే దెయ్యం.

4. వ్రాయడం బద్ధకం వేసేప్పుడు చక్కని చేతిరాతతో రాసే దెయ్యం, లేకపోతే నా గజిబిజి అక్షరాల్ని అర్థం చేసుకుని ఫెయిర్ కాపీరాసే దెయ్యం ఇవి అర్జంటుగా కావలెను. పనిని బట్టి యూ, నైపుణ్యమూను బట్టియూ జీతభత్యములు చెల్లింపబడును.

*ఇట్లు*

*మూడో సీత*

*నిజందెయ్యాలు*

"వెళ్ళంగివాడు పెళ్ళాన్ని తన్ని వెళ్ళగొట్టాడేవ్!" స్కూల్లో నాతో చెప్పింది సరస్వతి. సరస్వతి యీ మధ్యే మా క్లాస్‌లో చేరింది, వాళ్ళ నాన్నగారికి మా వూరే ట్రాన్స్‌ఫర్ అవడంతో! మాంఛి హుషారైన పిల్ల. వాళ్ళ స్కూల్లో తనే ఫస్టుట. చాలా మంచిది అనటంలో ఎటువంటి సందేహమూ అక్కర్లేదు. ఎందుకంటే, మా క్లాసులో ఆడపిల్లలు పిల్లికి కూడా బిచ్చం పెట్టని టైపు. మగపిల్లలేనయం. సరస్వతి అట్టాకాదు. ప్రతిరోజూ ఇంటినించి తెచ్చుకునే స్టీలు డబ్బాలోని తినుబండారాల్ని 'స్పూను'తో అందంగా తీసి నాకు పంపిణీ చేస్తూ వుండేది. ఆ రోజుల్లో 'స్పూను' వాడే నాగరికుల్ని వేళ్ళమీద లెక్కపెట్టొచ్చు. ఘుమఘుమలాడే జీడిపప్పు ఉప్మా, ఉల్లిపాయ మినపట్టు, అల్లం జీలకర్రా పచ్చిమిర్చీ దట్టించిన పెసరట్టూ, మాంఛి బంగాళాదుంప కూరతో నోరూరించే పూరీలూ ఇలా రోజుకో 'వెరైటీ' తెచ్చి ప్రేమగా 'మనకి' తినిపించే సరస్వతి, అతి కొద్దిరోజుల్లోనే నా 'బెస్ట్‌ఫ్రెండ్' అయిపోయిందని వేరే మీకు చెప్పక్కర్లేదు కదా!

ఇంతకీ 'వెళ్ళంగి' వాడంటే వెళ్ళంగి రామారావు. ఓ అయిదారు నెలల క్రితం ఎక్కడో తూర్పుగోదావరి 'వెళ్ళంగి' అనే వూరినించి మా వూరు కొచ్చి మా స్కూలుకి దగ్గర్లో 'బడ్డీ' కొట్టుపెట్టాడు. ఆ బడ్డీకొట్లో పిల్లలకి కావల్సిన తినుబండారాల్నించి, పెన్సిళ్ళూ, రబ్బర్లూ, స్కేళ్ళూ ,జామెట్రీ బాక్సులూ, దేశపటాలూ, ప్రపంచపటాలు, డ్రాయింగు పేపర్లూ ఇవన్నీ వుండేవి.

మనిషి మంచిగా తూర్పు యాసతో మాట్లాడేవాడు. ఎవరేది అన్నా, చిత్తం, చిత్తం పాపగారూ, చిత్తం బాబుగారూ, అంటూ వుండేవాడు. అంతమంచివాడూ పెళ్ళాన్ని తన్ని వెళ్ళగొట్టటం ఏమిటీ?

"ఆవిడెక్కడుందీ?" ఆరా తీశా. ఆవిడ చాలా అందంగా వుంటుంది. నేను చూశా.

"రాత్రి అంతా గుమ్మం ముందే పడివుందిట. పొద్దున్నే వెళ్ళంగి వాళ్ళ ఇంటిపక్కనున్న 'కామినేని' వాళ్ళు వాళ్ళింటికి తీసికెళ్ళి కాస్త కాఫీ ఇచ్చారుట." వివరించింది సరస్వతి.

"ఎందుకు తన్నాడట?" మళ్ళీ అడిగాను.

"తెలీదు.!. తిండి బెల్లు అయ్యాక కనుక్కుందామా?" ఉత్సాహంగా అంది సరస్వతి.

"మరి!" తలెగరేశాను నేను.

'తిండిబెల్లు' కొట్టగానే ఇద్దరమూ కామినేని సత్యంగారింటికి పరిగెత్తాం. ఆవిడ అంటే 'సూర్యావతి' అక్కడే వుంది.

"వెళ్ళంగోడు నిన్ను కొట్టాట్టగా? ఎందుకూ?" డైరెక్టుగా అడిగేశా.

"అవునండీ పాపగారూ.!" అంటూ దెబ్బలు చూపించింది. ఏ కర్రతో కొట్టాడోగానీ వీపుమీదా చేతులమీదా వాతలు తేలివున్నాయి. పాపం బుగ్గలు ఎర్రగా ఉబ్బివున్నాయి.

"ఎందుక్కొట్టాడూ?" సరస్వతి అడిగింది.

"పెళ్ళప్పుడు వాళ్ళ వాళ్ళు అడిగినంత కట్నం ఇచ్చామండీ; ఇంకా తెమ్మని ఇలా తంతావుంటాడండీ!" అన్నది సూర్యావతి.

"ఇంతకు ముందు కూడా ఇలా కొట్టేవాడా?" నేనడిగా.

"అవునండీ.., చాలాసార్లు కొట్టాడండీ! అప్పుడేమో మావోళ్ళు పదీ పరకా ఇచ్చేవోరండీ.. ఇప్పుడాళ్ళదగ్గిరా పైసాలేదండీ.. అందుకే మావోళ్ళ దగ్గరికి వెళ్ళానన్నానండీ.. దాంతో ఇలా చెడ తన్నేసినాడండీ!" ఏడుస్తూ అంది సూర్యావతి. కాసేపు ఆవిడతో అదీ ఇదీ మాట్లాడి మేం స్కూలికి వచ్చేశాం.

నాకసలు యీ కట్నాల గురించీ, మొగుళ్ళు పెళ్ళాల్ని తన్నటం గురించీ అప్పటిదాకా ఏమీ తెలీదు.

నాకు తెలిసినంతవరకూ, నేను చూసినంతవరకు కోపం వస్తే మొగుళ్ళు తిట్టేవాళ్ళేగానీ, ఇలా కొడతారనీ, కట్నం కోసం పీడిస్తారనీ తెలీదు.

కానీ పట్నంలో చదువుకుంది గనక సరస్వతికి ఇటువంటి విషయాలు బాగా తెలుసు. "ఇంతే కాదే సీతా, కొంతమంది అయితే నానా హింసలూ పెడతారు. ఆ హింసని భరించలేక కొంతమంది ఆడవాళ్ళు నూతుల్లో దూకటం కూడా నాకు తెలుసు!" అని, తనకి తెలిసిన విషయాలన్నీ వర్ణించింది.

ఆ రోజు రాత్రంతా నాకు ఇట్టాంటి కలలే వచ్చాయి. పొద్దున్నే మా నాన్నకి సూర్యావతి విషయం చెప్పాను.

"లోకంలో ఇవన్నీ జరుగుతూనే వుంటాయి. నువ్వీ విషయాలు వదిలేసి చక్కగా చదువుమీదే ధ్యాస మళ్ళించు!" అన్నాడు మా నాన్న -

"అదేంటి నాన్నా.. నువు చూడలేదుగానీ పాపం ఆవిడ వొంటిమీద ఎన్ని వాతలో!" అన్నాను.

"ఊరి విషయాలు నీకెందుకే భడవా?" మా అమ్మ కలిపించుకుని నామీద కొచ్చింది. "మా నాన్నకూడా అట్లా వాతలు తేలేలా నిన్ను కొడితే వూరుకొంటావా? నా మొగుడు గనక నన్ను అట్లా కొడితే వాడి బుర్ర రామకీర్తన పాడిస్తా. కీళ్ళు విరిచి పొయ్యిలో పెడతా. కత్తి పుచ్చుకు పొడిచేస్తా!" ఆవేశంగా అన్నాను. (రాత్రి ఎవడో నన్ను తన్నినట్టు కలకూడా వొచ్చింది మరి!)

"ఆలూలేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగంట. నోర్మూసుకో.! ఎవడన్నావింటే నవ్విపోతారు!" అన్నది మా అమ్మ. ఏం చేస్తాం?

"గాంధీగారికి 'సత్యాగ్రహం' అనే ఆయుధాన్ని అందించింది కస్తూర్బాగాంధీ!" అంటూ మా పురుషోత్తం మేష్టారు అవ్వాళ పాఠం మొదలెట్టారు. వివరం ఏమిటంటే - గాంధీగారు చాలా కోపిష్టిట. బయట వాళ్ళముందు శాంతంగా ఉంటూ, ఆ చికాకునంతా

కస్తూరిబా మీద చూపించేవారుట. ఓసారి ఆవిడకి చాలా బాధ కలిగి, మౌనంగా తన పనులు అన్నీ చేస్తూనే ఉలక్కుండా పలక్కుండా ఉన్నదిట. మొదటి రెండుమూడు రోజులు గాంధీగారు గమనించలేదుగానీ, తరవాత అడిగారట.

"ఏమిటీ? ఎందుకు మౌనంగా వున్నావూ?" అని. అప్పుడు కస్తూర్బాగారు, "అందరిముందూ మీ కోపం చూపిస్తున్నారు. అది సరైన పద్ధతికాదు. యీసారి నించీ మళ్ళీ మీరు ఆ విధంగా ప్రవర్తిస్తే, నేను మౌనంగా నా సత్యాగ్రహాన్ని కొనసాగించక తప్పదు!" అని.

అప్పుడాయనకి అర్థమైందిట. మౌనం ఎంత శక్తివంతమైన ఆయుధమో. పెద్దయ్యాక ఇదే విషయాన్ని గాంధీగారి ఆత్మకథలో నేను చదివాను. ఆ విషయం పక్కన పెడితే, పురుషోత్తం మాస్టారు చెప్పిన పాఠం నిజంగా జీవితంలో మాకు ఉపయోగపడింది. ఆ సాయంత్రం మేం ఓ సమావేశం ఏర్పాటు చేసుకున్నాం. నేనూ, సరస్వతీ పుష్పకుమారీ, జయలక్ష్మీ విజయలక్ష్మీ రేఛల్, చంద్రకాంత, కమలకుమారీ మాత్రమేగాక మా A&Bసెక్షన్‌లో వుండే మగపిల్లల్ని కూడా ఆహ్వానించాం. అందరం కలిసి, వెళ్ళంగి రామారావు బడ్డీకొట్టుకెళ్ళాం..

"ఇదిగో రామారావుగారూ, రాత్రి మీ ఆవిడ సూర్యావతిని తన్ని బయటికి నెట్టారని మాకు తెలుసు. కట్నం కోసం పీడిస్తున్నారనీ మాకు తెలుసు ఇలా ఇంకోసారి జరగటానికి వీల్లేదు. జరిగిందో నీ దగ్గర ఎవరం ఏమీ కొనం.. అంతేగాక ఊరంతా నువ్వు చేసిన వెధవ పని గురించి ప్రచారం చేస్తాం. అవసరమైతే మొత్తం హైస్కూలు పిల్లలమంతా ఊరేగింపుగా వెళ్ళి పోలీసు స్టేషన్లోనూ, మెజిస్ట్రేటుగారింటి దగ్గరా నీ గురించి కంప్లైంటు ఇస్తాం. ఏం చేస్తావో నీ ఇష్టం. మర్యాదగా కామినేని వాళ్ళింటోనించి నీ పెళ్ళాన్ని బతిమలాడి నీ ఇంటికి తీసుకుపో!" అన్నాం.

అంటే, నేనొక్కదాన్నేకాదు. మేమందరం తలో మాటా చెప్పామన్నమాట. ఏమనుకున్నాడో ఏమోగానీ, తలొంచుకుని, "అట్లాగే అమ్మాయిగార్లూ చిత్తం!" అన్నాడు.

నాకో మంచి విషయం తెలిసింది. 'ఒక్కడు'గా ఉంటే సాధించేది కొంచమే. అందరూ గనక కలిస్తే "ఎంతైనా" సాధించవొచ్చని.

మరుసటి రోజున తిండిబెల్లు కొట్టాక సూర్యావతిని కలిశాం.

"నా నెత్తిమీద పాలుపోశారండీ పాపమ్మగార్లూ!. ఆయనే వచ్చి ఇంటికి తీసుకెళ్ళారండీ!" అన్నది ముఖం 'ఇంత' చేసుకుని సంతోషంగా.

సగర్వంగా యీ విషయాన్ని మా నాన్నతో చెప్పాను. ఆయన చాలా సంతోషించి, "లక్షమాటల కంటే ఒక్క 'చేతే' గొప్పదే సీతా! చిన్నదానివైనా మంచిపని చేశావు!" అన్నారు.

"నేను ఒక్కదాన్నికాదు నాన్నా., మా క్లాసు మొత్తం వెళ్ళబట్టి అతను భయపడ్డాడు!" అన్నాను. నిజమేగా మరి. 'పోలీసులూ, మేజిస్ట్రేటూ అంటూ బెదిరిద్దాం' అన్న సలహా ఇచ్చింది సరస్వతేగా.

'విజయం' ఎంత చిన్నదైనా, అది ఇచ్చే 'స్ఫూర్తి' చాలా గొప్పదని అవాళ అర్థమైంది. పుస్తకాలనే కాదు - మనుషుల్ని కూడా చదివితేనే జీవితం సమగ్రమవుతుందని అర్థమైనదీ అవ్వాళే. ఎందుకంటే 'నిజందెయ్యాలూ' 'నిజం దేవుళ్ళూ' వుండేది మరి మనుషుల్లోనేగా!

## *మిస్‌కాటన్.ద ఇంజనీర్*

సడన్‌గా వర్షాలు తగులుకున్నై. ఏలూరునించి చింతలపూడి సత్తుపల్లివైపు ఏరియా అప్‌లాండ్ అంటారు. అంతేగాదు.. ఏలూరి వాళ్ళు మమ్మల్ని 'ఉత్తరపోళ్ళు' అనికూడా పిలుస్తారు. అవటానికేమో పశ్చిమ గోదావరి జిల్లా "ఆంధ్రప్రదేశ్ అంతా నీళ్ళల్లో వుంటేగానీ మనూరికి వర్షాలు రావురోయ్!" అని మా వాళ్ళు అనే మాట నిజమే. వర్షాకాలంలో వర్షాలు పడతైగానీ చాలా తక్కువ. మా వూరి పెద్ద

చెరువు నిండితే దాన్క్రింద కొన్ని ఎకరాలు (వందల్లోనే అనుకోండి) కాంతం పాలెం చెరువు కింద, బూడిద గుంట చెరువు ఆయుకట్టు ప్రాంతాల్లో తప్ప మిగతాదంతా వర్షాధారప్పొలాలే. అందుకే జనాలు జీడిమావిడీ, మావిడీలాంటి తోటలూ, మొక్కజొన్న జొన్నలాంటి మెట్టపంటలు వేస్తారు. ఇహ ప్రగడారం ధర్మాజీగూడెంలాంటి ప్రాంతాల్లో పొగాకు మిర్చిలాంటివి బ్రహ్మాండంగా పండుతై.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, మనుషులు పెరిగిన వాతావరణం నుంచే మనస్తత్వం ఏర్పడుతుందని. వర్షాలు బాగా వస్తే మాకు పండగే! తమ్మిలేరు పొంగి పొరలుతుంది. పడగెత్తి ఆడే నాగినిలాగా వంపులు వొంపులు తిరుగుతూ ప్రవహిస్తుంది.

అయిదోతరగతి నించీ వానల్లో తడవటం మాకందరికి ఓ వ్యసనం. వర్షం వస్తే చాలు. కట్టెపుల్లలూ గడ్డీ విరిగిన ఇటుకలూ చిన్న చిన్న రాళ్ళూ అటూఇటూ పరిగెత్తి తెచ్చేవాళ్ళం. మట్టి రోడ్లేశా.! వాటికి మేం తెచ్చిన సరంజామాతో అడ్డకట్టలు వేసి - ఆనకట్ట కట్టేవాళ్ళం. మరి దానికి తూములు ఉండాలిగదా! బొప్పాయి తూడుల్ని 'తూములు'గా వాడేవాళ్ళం.

రెండు మూడురోజులు వరసగా వర్షం కురిస్తే, ఎక్కడ్నించి పుట్టుకొచ్చేవో మరి బోలెడన్ని చేపపిల్లలూ కప్పపిల్లలూ చిట్టి చిట్టి జలగలు రోడ్డుమీది ప్రవాహంలో కొట్టుకొచ్చేవి. కప్పల్ని పట్టి, వాటి నడుముకి దారాల్ని కట్టి వాటిని 'గెంతించటం' ఓ ఆట.

అలాగే జలగల్ని పట్టి ఏమరుపాటుగా వున్న వాళ్ళకి 'పట్టించడం' ఇంకో స్పోర్టు. జలగ పట్టిన వాడు చూసుకుని కుయ్యోమొర్రో అంటే 'ఉప్పు'గానీ 'పొగాకు' గానీ జలగ దగ్గర పెట్టేవాళ్ళం. అవి వెంటనే పట్టిన జాగాని వదిలేసి రక్తం కక్కేసేవి. అసలు జలగపడితే మనకి తెలీనే తెలీదు. అంత సుతారంగా పడతై. వానపాముల్ని పట్టడమూ ఓ కళే.

ఇదిగాక ఆనకట్టల పోటీలుండేవి. ఇరవై అడుగులకో ఆనకట్ట. అలా మూడో నాలుగో కట్టేవాళ్ళం. ఎవడు 'గండి' పడకండా కడతాడో వాడు గ్రేటన్నమాట. ఆ విషయంలో నేను ఎక్స్పర్ట్నని వేరే చెప్పక్కర్లేదుకదా! మిగతా వాళ్ళు రాళ్ళూ రప్పలూ పోగేస్తే నేను, ఇటికలు ఎవరు తెప్పించారో చూసుకుని, ఎవరూ చూడకుండా 'కొట్టుకు రమ్మని మా పాకబడి బేచ్కి పురమాయించి, వాటిని జాగ్రత్తగా పేర్చి, వాటి మధ్యనించి నీళ్ళు పోకుండా బొప్పాయి ఆకులూ మండలూ నైపుణ్యంగా దూర్చి, మహా ఉత్సాహంగా బేరేజీలు కట్టేదాన్ని.

కాటన్ దొరగారు గోదావరి బ్రిడ్జి కట్టినట్లు 'మనం' ఉప్పరిగూడెం రోడ్డుమీద పడ్డ బండ్గా ఆనకట్టలు కట్టేవాళ్ళమన్నమాట.

ఎవరో ఒకరు యీ విషయాలు ఇంటి దగ్గరకి మోసుకుపోకుండా వుండరుకదా! మా అమ్మ నా చెవుల్ని ఎన్నిసార్లు 'ఎక్క'దీసినా, ఆనకట్టలు కట్టడం మాత్రం ఛస్తే మానేదాన్నికాదు. అందుకే మా నాన్న ముద్దుగా "ఒసేయ్ కాటనూ, ఇవాళైనా కాసేపు ఇంట్లో కూచోవే, తడవకండా!" అని బతిమలాడేవాడు.

ఇహ వర్షాకాలంలో మెండుగా వర్షాలు పడితే ఎన్ని మజాలో! కప్పలు కుప్పలు తిప్పలుగా పుట్టుకొస్తాయిగదా! అవి 'కురూకురూ' అంటూ వర్షాన్ని తమ అరుపులతో సతాయిస్తాయిగదా! 'ముసురు' గనక లంకించుకుంటే ఆ కప్పలు బోదురు కప్పల్లా రూపాంతరం చెందుతాయిగదా! అవి అరిచేటప్పుడు 'తిత్తులు' ఇంత లావున గుండ్రంగా ఉబ్బి మనకి ఉల్లాసాన్ని కలుగజేస్తాయిగదా!

ఇహ కప్పల్లో కూడా కులాలున్నాయి. కోమటి కప్పలైతే 'బేరం...బేరం..' అని అరుస్తై. బ్రాహ్మణ కప్పలు 'ముదపప్....ముదపప్..' అని అరుస్తై. పేదకప్పలు..'బు..వ్వా....బు...వా' అని అరిస్తే, కోపిష్టికప్పలు 'తలచెడా..తలచెడా' అని అరుపులంకించుకుంటై. అయ్యా, నేను ఉత్తినే చెప్పట్లా కావాలిస్తే యీసారి వర్షాలు వచ్చినప్పుడు కప్ప అరుపుల్లోని తేడాలు మీరే గమనించండి.

వర్షాకాలంలో వుండే మజా ఏకాలంలోనూ వుండదు. చెట్లన్నీ వాననీటిలో 'స్నానం' చేసి పచ్చగా శుభ్రంగా వుంటై. గేదెలైతే హాయిగా ఆ వానని ఆస్వాదిస్తాయి. ఆవులు మాత్రం పొరపాట్న కూడా వానలో తడవటానికి ఇష్టపడవు. 'తడి' అంటేనే ఆవులకి చికాకు.

కోళ్ళకైతే వర్షం వస్తే పండగే. వానపాముల్నీ జలగల్నీ చిన్న చిన్న పురుగుల్నీ మహా ఉత్సాహంగా ముక్కుతో పొడిచి మరీ తింటై. పిల్లలకోడి అయితే, వానపాముని ముక్కలు ముక్కలు చేసి మరీ పిల్లలకి తినటం నేర్పిస్తూ ఉంటుంది.

ధారగా ఇళ్ళ కప్పుల మీద నించి వాననీళ్ళు జారిపడుతూ వుంటే, పడే చినుకులు 'బుడగలు'గా మారుతుంటే, హాయిగా ఓ దుప్పటి కప్పుకుని వానరాణి విన్యాసాలు చూడటం ఎంత బాగుంటుందో!

అలా బద్ధకంగా చూస్తూ చూస్తూ మధ్యలో వేడివేడి బజ్జీలో పకోడీలో తింటూ, తిన్నాక చేతుల్ని వాననీళ్ళతో కడుక్కుని మళ్ళీ ఆ చల్లని చేతుల్తో మొహం కప్పుకుంటే ఎంత హాయిగా ఎంత మత్తుగా ఉంటుందో!

"వానావానా వెల్లువాయే కొండా కోనా తుళ్ళిపోయే!"

*(వచ్చేనెలలో మళ్ళీకలుద్దాం)*

Post your comments